సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 26 । మార్చి । 2024

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగులు చల్లుకుంటున్న నాయకులు, కార్యకర్తలు



రంగు పడిందిరోయ్..





సిద్దిపేటలోని జీకే అపార్ట్‌మెంట్‌లో హోలీ ఆడుతున్న మహిళలు



రంగుల్లో చిన్నారుల కేరింతలు



వేడుకల్లో జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, మంజుల, ఫారూఖ్ హుస్సేన్ తదితరులు

రంగుల కేళీ.. హోలీ

ఎటు చూసినా రంగుల హోరే.. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా హోలీని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి బంధువులు, స్నేహితులతో కలిసి సంతోషంగా వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన సంబరాల్లో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరూ రంగులు చల్లుకున్నారు. ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అలాగే ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు, వాసవీక్లబ్, వనితాక్లబ్, వివిధ కుల సంఘాల సభ్యులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : మంగళవారం (సాయంత్రం) 06:34

సహర్ : బుధవారం (ఉదయం) 04:53

న్యూస్‌రీల్

వర్గల్ క్షేత్రంలో చంద్రమౌళీశ్వరాలయం

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో చంద్రమౌళీశ్వరాలయం కొలువుదీరింది. భక్తుల సహకారంతో నిర్మితమైన ఈ ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి తెలిపారు. తెల్లవారుజామున ప్రతిష్ఠోత్సవాలకు గణపతి పూజతో అంకురార్పణ జరుగుతుంది. పంచగవ్యప్రాశనం, ఆవాహిత దేవతా హవనం, జలాధివాసం, బుధవారం పంచాయతన సహిత మూల మంత్ర హవనం, ధాన్యాధివాసం, శయ్య, పుష్ప, ఫలాధివాసం, గురువారం గర్తన్యాసం జరుగుతుంది. ఉదయం 8.39 గంటలకు రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామిచే యంత్ర మూర్తి ప్రతిష్ఠాపనోత్సవం జరుగుతుందని సిద్ధాంతి తెలిపారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



గ్రామ పెద్దలతో కలిసి మాట్లాడుతున్న డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) జిల్లా అధ్యక్షుడు రవి బాబు అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌ను సోమవారం డీఎస్పీ నాయకులు సందర్శించారు. గ్రామంలోని అన్ని కుల పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ముదిరాజ్ కులస్తులపై వచ్చిన ఆరోపణలకు సామరస్యంగా పరిష్కారం లభించడం శుభపరిణామన్నారు. అన్ని కులాలు ఐక్యంగా ఉంటేనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఆ దిశగా అందరూ ఏక తాటిపై నడవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చందు, లక్ష్మణ్, యాదగిరి, నందు, కనక మల్లేశం, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మాకు న్యాయం చేయండి'

జహీరాబాద్ టౌన్: తమను ఆర్టీసీ డిపో మేనేజర్, కొంత మంది అధికారులు వేధిస్తున్నారని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పట్టణానికి వచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కొంత మంది కార్మికులు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేశారన్న నెపంతో వారిపై అధికారులు కక్ష గట్టారని ఆరోపించారు. డ్యూటీలు, సెలవుల పరంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఆరోగ్య సమస్యలు వచ్చినా సెలవు ఇవ్వడం లేదన్నారు. మహిళా కార్మికులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు.

కమ్ముకొస్తున్న కరువు

- అంతటా సాగునీటి తిప్పలు
- పాతాళానికి భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోరు బావులు
- ఎండుతున్న పంట పొలాలు
- చేసేదిలేక పశువులను మేపుతున్న రైతులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నదాతల అరిగోస



పంటను కాపాడుకునేందుకు ఇలా ట్యాంకరు ద్వారా నీటిని అందిస్తున్న ఈ రైతు పేరు బాజాబాబు. నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన అతను తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేశారు. పంట ప్రారంభ దశలో నీటి తడులు అందడంతో మంచిగా పెరిగింది. ఇటీవల ఎండల తీవ్రత పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి బోర్ల నుంచి నీరు రావడం లేదు. రూ.లక్షన్నర వెచ్చించి రెండు బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సి వస్తోందని వాపోయారు.



ఎండిపోయిన వరి పంటలో గొర్రెలు, మేకలను మేపుతున్న ఈ రైతు పేరు భూమల్ల సత్తయ్య. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామం. సత్తయ్యకు రెండు ఎకరాల భూమిలో ఓ బోరు, వ్యవసాయ బావి ఉంది. ఈ సారి రెండింటిలో నీరు తగ్గిపోవడంతో ఎకరం భూమిలోనే వరి సాగు చేశారు. మరోవైపు ఎండల ప్రభావంతో నీరు అందక ఆర ఎకరానికి పైగా పంట ఎండిపోయింది. పంట అంతా గొర్రెలు, మేకలకు మేతగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.



సన్నటి నీటిధారగా వస్తున్న ఈ బోరు అందోల్ మండలం కన్‌సాపల్లికి చెందిన శ్రీశైలం అనే రైతుది. 13 ఎకరాల్లో వరితో పాటు మొక్కజొన్న, జొన్న పంటను సాగు చేశారు. మొదట్లో నీరు అందినా పక్షం రోజులుగా పెరిగిన ఎండల తీవ్రతకు బోరు బావుల నుంచి సరిగ్గా నీరు రాక పంట ఎండుముఖం పట్టింది. రాత్రింబవళ్లు కుటుంబం అంతా కలిసి పొలం వద్దే ఉంటూ మడిమడికి నీరు పారిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికే మూడెకరాల వరి పంట ఎండుముఖం పట్టిందని తెలిపారు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి /నెట్‌వర్క్ ....

రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు.. నెర్రలు బారుతున్న వరి పొలాలు.. పశువులకు మేతగా మారుతున్న పంటలు.. ఇలా మెతుకు సీమపై కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. మంచి దిగుబడితో చేతికందాల్సిన పంటలు కళ్లెదుటే ఎండుముఖం పడుతుండటంతో అన్నదాతల కంట కన్నీరు వస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో యాసంగి పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా వరి సాగు చేసిన రైతులు తమ పంటలను కాపాడుకోలేక పడరాని పాట్లు పడుతున్నారు. రోజురోజుకు ఆందోళన స్థాయికి పడిపోతున్న భూగర్భ జలాలతో బోర్ల నుంచి నీటి ధారా తగ్గుముఖం పట్టింది. పలుచోట్ల బోర్లు పూర్తిగా వట్టిపోయాయి. బోర్ల ఆధారంగా సాగు చేసిన వరి పంటలు నెర్రలు బారాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

మూడు మీటర్లకు పడిపోయిన నీటి మట్టం..

ఉమ్మడి జిల్లాలో భూగర్భజల మట్టం పడిపోతోంది. ఎండల తీవ్రతకు ఈ జలాలు పాతాళానికి చేరుతున్నాయి. సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలో ఏకంగా మూడు మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టం పడిపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. గత ఏడాదితో పోలిస్తే భారీ స్థాయిలో నీటి మట్టాలు పడిపోయాయి. ఈ మండలంలో 2023 ఫిబ్రవరిలో 10.65 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలమట్టం.. 2024 ఫిబ్రవరి వచ్చే సరికి 13.66 మీటర్ల లోతుకు వెళ్లింది. సగటున 0.2 మీటర్ల లోతుకు వెళ్లిపోయాయి. ఈ మార్చి నెలలో ఈ నీటి మట్టాలు ఇంకా లోతుకు వెళ్లే పరిస్థితి నెలకొంది. మెదక్ జిల్లాలో గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే సగటున 0.83 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది.

ఇదీ పంటల తీరు..

◆ సంగారెడ్డి జిల్లా ఈ యాసంగిలో మొత్తం 1.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వరి పంట 1.02 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. ఇందులో బోర్లు వట్టి పోవడం.. ఎండల తీవ్రతతో ఇప్పటికే సుమారు పది వేల ఎకరాల్లో వరి ఎండిపోయినట్లు అనధికారిక అంచనా.

◆ మెదక్ జిల్లాలో ఈసారి 2.61 లక్షల ఎకరాలలో వరిపంటలను సాగు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం 95 వేల బోరుబావుల ఆధారంగా పంటలను నీటి తడులు అందిస్తున్నారు.

◆ సిద్దిపేట జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.52 లక్షల ఎకరాలు. గత ఏడాది (2023 యాసంగిలో)3.72 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ యాసంగి సీజనులో 3.72 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారు.

పంటలు కాపాడుకునేందుకు పాట్లు

కళ్లెదుటే ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బోర్ల నుంచి సన్నటి ధార వస్తుండటంతో రోజంతా బోరు నడిచినా మడులు తడవడం లేదు. దీంతో పైపులు వేసుకుని కింద మడులకు నీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని చోట్ల చేసేదేమీ లేక ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసుకుంటున్నారు. ఇందుకోసం రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసిన పంట చేతికందే పరిస్థితి లేకపోవడంతో ఎండిపోతున్న పంటలో పశువులను మేపుతున్నారు.



చేగుంట: అనంతసాగర్‌లో బీటలు వారిన వరి పొలం

రెండు బోర్లు వేసినా పంట దక్కలే



కొల్చారం(నర్సాపూర్): ఈ ఏడాది యాసంగిలో 5 ఎకరాల్లో వరి సాగు చేశా. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు నీరు పోయడం ఆగిపోయింది. పంటను దక్కించుకునేందుకు రూ. 3 లక్షలు వెచ్చించి కొత్తగా రెండు బోర్లు వేశా. వాటిలోనూ నీరు కొద్దిగా వచ్చి ఇప్పుడు పూర్తిగా పోయడం లేదు. పెట్టుబడి రూ.1.10 లక్షలైంది. ప్రస్తుతం ఐదెకరాల వరి ఎండిపోయి, పశువులకు మేతగా మారింది. - మోహన్, సీతారాం తండా, కొల్చారం

రెండు ఎకరాల్లో పంట ఎండింది



నాలుగెకరాల్లో వరి సాగుచేశా. మొదట్లో రెండు బోరు బావులు బాగానే నీరుపోశాయి. ఎండలు ముదరడంతో బోర్ల నుంచి నీరు సరిగ్గా రావడం లేదు. కరెంట్ ఉన్న సమయంలో నిరంతరంగా బోరు నడిచినా రెండు రోజులకు కూడా ఒక నారుమడి తడవడం లేదు. దీంతో పంటకు సరిగ్గా నీరు అందక సగం పంట ఎండుతోంది. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. పంట సాగులో ఇప్పటివరకు రూ.45 వేల పెట్టుబడి పెట్టి సాగుచేశాను. చివరికి పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు కనబడటం లేదు.

- దుర్గయ్య, కన్‌సాన్‌పల్లి, అందోలు మండలం

బోర్ల కోసం గొర్రెలను అమ్ముకున్నా..



మూడు ఎకరాలలో వరి వేశా. గింజపెట్టే దశలో బోరులో నీరు తగ్గడంతో ప్రస్తుతం గుంట కూడా పారే పరిస్థితిలేదు. రూ.రెండు లక్షలు ఖర్చు చేసి రెండు బోర్లు వేశాను. చుక్కనీరు పడలేదు. దీంతో ఈ బోర్ల కోసం చేసిన అప్పును తీర్చేందుకు నాకున్న గొర్లను కొన్నింటిని అమ్ముకోవాల్సి వచ్చింది.

- మాడగల రాజు, నార్సింగి, మెదక్ జిల్లా

పచ్చని చెట్ల కింద కుటీరం



చేరువలో ఆహ్లాదం.. చెంతనే కుటీరం

పక్కనే మక్క చేను. ఎదురుగా పచ్చని వరి పైరు. చల్లగా హాయినిచ్చే పచ్చని చెట్ల నీడలో ఉండటానికి ఓ చక్కని కుటీరం. మండల పరిధిలోని ధర్మారం శివారులో రైతు నారాయణ తన వ్యవసాయ పొలంలో ఈ కుటీరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మండు వేసవిలో చల్లదనంతో పాటు ఆహ్లాదం పంచుతోందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చుట్టు పక్కల రైతులు ఈ చెట్ల నీడను ఆశ్రయించి ఎండల నుంచి ఉపశమనం పొందుతారని తెలిపారు.

- మిరుదొడ్డి(దుబ్బాక)

విధులు అప్రమత్తంగా నిర్వహించాలి

ములుగు(గజ్వేల్): చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. జిల్లా సరిహద్దు గ్రామమైన వంటిమామిడి రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురుచేసే వస్తువులను, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.

రూ.2.36 లక్షలు సీజ్..

ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి తీసుకెళ్తున్న రూ.2.36 లక్షలు సీజ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. డబ్బులు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌సెల్‌లో డిపాజిట్ చేస్తామన్నారు. తగు ఆధారాలు చూపించి వాటిని తీసుకోవాలని సూచించారు. ఏసీపీ వెంట ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వంటిమామిడి చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి, పోలీసులు

కాంగ్రెస్‌లోకి మదన్‌రెడ్డి ?



నర్సాపూర్: నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైందని తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నర్సాపూర్ బీఆర్ఎస్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన మదన్‌రెడ్డికి కాకుండా సునీతారెడ్డికి కేటాయించిన సమయంలో ఆయనకు ఎంపీ టికెట్ ఇస్తామని బీఆర్ఎస్ అధిష్టానం హామీ ఇచ్చింది. కాగా త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మెదక్ ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. బీఆర్ఎస్‌లో సరైన గౌరవం లభించడం లేదని ముఖ్య అనుచరుల వద్ద మదన్‌రెడ్డి తన బాధను వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలాఉండగా అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరిగినా అప్పట్లో చేరలేదు. రెండు మూడు రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అనుచరుల వద్ద కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరిపారని, సీఎం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సమాచారం. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఇంట్లో మదన్‌రెడ్డి సమావేశమై కాంగ్రెస్‌లో చేరే తేదీని ఖరారు చేసే అవకాశం ఉందని తెలిసింది.

మల్లన్న సన్నిధిలో కలెక్టర్



కలెక్టర్‌కు స్వామి వారి చిత్ర పటం, ప్రసాదం అందిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి దర్శించుకున్నారు. సోమవారం కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రసాదం, స్వామి వారి చిత్ర పటాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈఓ బాలాజీని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఎస్ఐ నాగరాజు, ఒగ్గు పూజారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో ప్రతిభ



బెల్టు అందజేస్తున్న నగేశ్

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్ర స్థాయి కరాటేలో జిల్లాకు చెందిన విద్యార్థి బ్లాక్ బెల్ట్ సాధించినట్లు రెంజూకి షోటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, క్లబ్ ఫౌండర్ మాస్టర్ నగేశ్ తెలిపారు. సోమవారం ఆయన మెదక్‌లో మాట్లాడుతూ.. ఆదివారం హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లోని ఐస్పోర్ట్స్ అకాడమీలో కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలు నిర్వహించగా, తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. పోటీలకు తాను నిర్వాహకుడిగా వ్యవహరించగా, నవీన్, మిథున్, లావణ్య పర్యవేక్షకులుగా ఉన్నట్లు వివరించారు. ఈ పోటీల్లో పాపన్నపేట మండలం మిన్‌పూర్ గ్రామానికి చెందిన నీరజ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బ్లాక్ బెల్టు సాధించాడన్నారు.

గుండెపోటుతో మృతి



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం మర్పడ్గ గ్రామానికి చెందిన ఏర్వ శ్రీనివాస్‌రెడ్డి(55) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా, వైద్య శాఖలో సిద్దిపేట ఎన్‌వీబీడీసీలో సీనియర్ ఎంటమాలాజిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వారం రోజుల కిందట హైదరాబాద్‌లో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. సోమవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో రెడ్డి సంఘం సభ్యులు, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

ఏటీఎం చోరీకి యత్నం

ఇద్దరు దుండగుల అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): ఏటీఎం ధ్వంసం చేసి చోరీకి యత్నించిన ఇద్దరు దుండగులను పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పేట ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గవ్వలపల్లి చౌరాస్తాలోని మెదక్–చేగుంట రోడ్డుపై ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి నగదు చోరీకి ప్రయత్నించిన ఇద్దరు దుండగులు సీసీ కెమెరాలో రికార్డు అయ్యారు. మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి చెందిన పసుల ప్రవీణ్‌కుమార్, ముత్తిగారి ముకేష్ ముఖం కనిపించకుండా చేతి రుమాలు కట్టుకొని ఉన్నట్లు గుర్తించారు. సోమవారం దుండగుల ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

హోలీ వేడుకల్లో 119 ఏళ్ల బామ్మ



గజ్వేల్‌రూరల్: హోలీ పండుగ వచ్చిదంటే చాలు యువతీ, యువకుల ఆటపాటలతో సందడిగా మారుతుంది. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకోవటం ఆనవాయితీ. ఇదే నేపథ్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలో 119 సంవత్సరాల వృద్ధురాలు పంజాల లక్ష్మి హోలీ వేడుకల్లో పాల్గొన్నది. చాలా మంది పండుగలపై ఎలాంటి శ్రద్ధ కనబరచని ఈ రోజుల్లో తన వృద్ధాప్యాన్ని సైతం లెక్క చేయకుండా హోలీ వేడుకల్లో పాల్గొనడం అందరినీ విస్మయానికి గురి చేసింది. అంతేకాదు.. ప్రతి ఎన్నికల్లో ఓటు వేసి తన హక్కును సైతం వినియోగించుకుంటూ ఆదర్శంగా నిలుస్తోంది.

నాచగిరీశా.. ఏమిటీ గోస

నాచగిరి ఇక మరో యాదాద్రి అంటూ ఊరించిన రూ.100 కోట్ల బృహత్ ప్రణాళిక బుట్టదాఖలైంది. ముగ్గురు సీఎంలు, ఒక గవర్నర్ సందర్శన, మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలోనూ తన సొంత నియోజకవర్గంలోని ఈ క్షేత్రం దశ మారలేదు. కోట్ల ఆదాయం కలిగిన నాచగిరి ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందమైంది. దశాబ్దాల నిర్లక్ష్యానికి చిరునామాగా ఎదుగుబొదుగూ లేని క్షేత్రంలో తీర్థజనులకు ఇబ్బందులు షరా మామూలయ్యాయి. – వర్గల్(గజ్వేల్)

అభివృద్ధికి నోచుకోని నాచారం గుట్ట క్షేత్రం

- ఆదాయం ఉన్నా సౌకర్యాలు సున్నా
- బుట్ట దాఖలైన బృహత్ ప్రణాళిక
- ముగ్గురు సీఎంలు సందర్శన, ఒక సీఎం ప్రాతినిధ్యం
- అయినా అసౌకర్యాల నడుమే పుణ్యక్షేత్రం
- చెట్ల నీడ, గుడారాల మాటున భక్తుల సేద

రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం ప్రసిద్ధి. హరిద్ర తీరాన కొండ గుహల్లో స్వయంభువుగా కొలువైన శ్రీస్వామివారి దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం వందలాది భక్తులు తరలివస్తుంటారు. నాచగిరి క్షేత్రాన్ని సీఎం హోదాలో దివంగత ఎన్టీరామారావు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రెండుసార్లు కేసీఆర్, గవర్నర్ హోదాలో సుశీల్‌కుమార్‌షిండే సందర్శించారు. ఇక్కడ బస చేసేందుకు తగినన్ని సత్రాలు, అతిథిగృహాలు లేవు. దశాబ్దాల కిందట నిర్మించిన 48 సత్రాలు, 17 కాటేజీలు మినహా అంతకుమించి అభివృద్ధి జరగలేదు. సరిపడా శౌచాలయాలు లేవు. దీంతో యాత్రికులు చెట్ల నీడ, గుడారాల మాటున సేదతీరుతున్నారు.



నాచగిరి క్షేత్రం

తెరపైకి బృహత్ ప్రణాళిక

గతంలో సీఎం కేసీఆర్ కావడంతో ఆయన సొంత నియోజకవర్గంలోని నాచగిరి క్షేత్రం దశమారనుందని భక్తులు ఆశపడ్డారు. 2015 మార్చి 12న బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం హోదాలో కేసీఆర్ నాచగిరి సందర్శించి స్వామివారి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అదే సంవత్సరం 2015 ఆగస్టు 13న నాచగిరి సమగ్రాభివృద్ధి కోసం బృహత్ ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) తెరపైకి వచ్చింది. దీనిని సిద్ధం చేసేందుకు ఫైవ్‌మెన్ కమిటీని ఏర్పాటుతో నాచగిరి అభివృద్ధికి కీలక అడుగుపడినట్లేనని భావించారు. నాచగిరి బృహత్‌ప్రణాళిక రూపకల్పన కోసం కమిటీ సభ్యులు క్షేత్రంలో కలియదిరిగారు. యాదాద్రి తరహా అభివృద్ధి అంటూ ప్రాకారాలు, రాజగోపురం, గాలిగోపురాలు, మాడ వీధులు, బీటీ రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణకట్ట, పార్కింగు, డార్మెటరీలు, సత్రాలు, వీఐపీ అతిథి గృహాలు, టాయిలెట్లు, బాత్రూమ్‌లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర నిర్మాణాల కోసం రూ.100 కోట్ల అంచనాలతో బృహత్‌ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. రెండు విడతలు సీఎం కేసీఆర్ పాలన కొనసాగినప్పటికీ బృహత్ ప్రణాళిక అమలుకు నోచలేదు.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే..

అభివృద్ధికి నోచని నాచగిరి క్షేత్రంలో జాతర భక్తులకు సర్దు'పాట్లు' తప్పని పరిస్థితి నెలకొంది. ఈనెల 29 తేదీన జాతర ప్రారంభం కానుండడంతో యాత్రికుల ఇబ్బందులు తీర్చేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని కోరుతున్నారు. సత్రాలు, అతిథిగృహాల సంఖ్య, శౌచాలయాలు, దుస్తులు శుభ్రం చేసుకునే గదుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు. భక్తజనాదరణ కలిగిన క్షేత్ర ప్రగతికి, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



నాచగిరి వద్ద టెంట్ నీడలో యాత్రికులు



వంద గదుల సత్రం దుస్థితి

రూ.కోట్లలో ఆదాయం..

నాచగిరి క్షేత్రం ఏసీ క్యాడర్ టెంపుల్. దర్శనాలు, వ్రతాలు, వాహన పూజలు, ప్రసాద అమ్మకాలు తదితర పద్దుల ద్వారా ప్రతియేటా రూ. 3 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరుతుంది. గతేడాది 2022–23లో రూ.3,23,06,419 ఆదాయం లభించింది. అందులో హుండీ ద్వారా రూ.75,93,744, ప్రసాదాల ద్వారా రూ. 70,61,721, సత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.12,08,250, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.7,26,680, వాహన పూజల ద్వారా రూ. 3,89,900 ఆదాయం సమకూరింది. అదే విధంగా 2018–19లో రూ.2,64,56,868, కరోనా ప్రభావం కారణంగా 2019–20లో రూ. 1,50,29,404, 2020–21లో రూ.2,55,76,610, 2021–22లో రూ.2,50,80,791 ఆదాయం లభించింది. భక్తుల ద్వారా ఆదాయం ఘనమైనప్పటికీ వారికి సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు విఫలమవుతున్నారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



నాచారం గుట్ట నర్సింహస్వామి అంటే మాకు ఎంతో నమ్మకం. గుట్ట కాడ వసతులు సరిగాలేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వాగులో స్నానం చేసి గుడిల స్వామివారికి దండం పెడితే బాధలు పోతయ్. ఇబ్బందులు ఎట్ల ఉన్నా మాకు నర్సింహస్వామి దర్శనమే ముఖ్యం. చెట్టు కిందనో, పుట్టకిందనో సర్దుకపోతాం.

–నర్సింలు, యాత్రికుడు

చర్యలు చేపడుతాం



నాచగిరి క్షేత్రం అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నాం. అందుబాటులోని వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటాం. క్షేత్రంలో భక్తులకు ఇబ్బంది రాకుండా చూస్తాం. ఇందు కోసం వీలైనన్ని చర్యలు తీసుకుంటాం. ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం. టెంపరరీ శౌచాలయాలు, చలవపందిళ్లు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం బ్రహ్మోత్సవ భక్తులకు ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– అన్నపూర్ణ, నాచగిరి ఆలయ ఈఓ

జాతీయ స్థాయిలో రాణించాలి



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మహారాష్ట్రలో 29వ తేదీ నుంచి జరిగే 36వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో క్రీడాకారులు రాణించాలని తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు కోరారు. సోమవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ బాలికల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఇంటెలిజెన్స్ సీఐ రవికుమార్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి గోవర్దన్ గౌడ్, స్థానిక నాయకులు వెంకటరెడ్డి, కుమార్‌గౌడ్, శ్రీనివాస్, శిక్షకుడు రవి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

- ఏడుగురు యువకులు రిమాండ్
- 825 గ్రాములు స్వాధీనం

రాయపోల్(దుబ్బాక): అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ ఎస్‌ఐ రఘుపతి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 24వ తేదీన రాయపోల్–కొత్తపల్లి చౌరస్తా సమీపంలో వాహనానాలు తనిఖీ చేస్తుండగా పలువురు యువకులు ఐదు బైక్‌లపై వచ్చారు. అనుమానాస్పదంగా వ్యవహరించడంతో పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా రాయపోల్ మండలం అనాజీపూర్‌కు చెందిన భ్యాగరి స్వామి భద్రాచలం సమీపంలోని కందిగూడెం వెళ్లి కిలో గంజాయిని తీసుకొచ్చారు. ఇదే గ్రామానికి చెందిన కోనేరు మహేశ్‌బాబు, ఆరెపల్లికి చెందిన గొల్ల రాజు, బాకీ రాజు, గజ్వేల్ మండలం బూర్గుపల్లికి చెందిన పంజాల అనిల్, దేవుని కృష్ణమూర్తి, అహ్మదీపూర్‌కు చెందిన క్యామిద్రి వంశీలతో కిలో గంజాయిని 10 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేశారు. అందులో కొంత వారు సేవించి, మిగితా 825 గ్రాములను గజ్వేల్‌లో విక్రయించేందుకు వెళ్తుండగా మార్గమ ధ్యలో పట్టుకున్నాం. సోమవారం రిమాండ్‌కు తరలించి వారి వద్ద నుంచి గంజాయి, బైక్‌లు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



రాయపోల్(దుబ్బాక): వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ముగ్గురు అరెస్ట్

సంగారెడ్డి టౌన్ : టాస్క్ ఫోర్స్, సంగారెడ్డి రూరల్ పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం సంగారెడ్డి చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ బైక్ పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు సునీల్, చింటూ, రజినీకాంత్ పోలీసులను చూసి పారిపోతున్నారు. వెంటనే వారిని పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. ముగ్గురిని అరెస్ట్ చేసి 300 గ్రాముల గంజాయి, 16 సెల్ ఫోన్లు, బైక్ సీజ్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఫేస్ బుక్ పరిచయం.. లక్షల్లో మోసం

ఉద్యోగిని నమ్మించి రూ.8.57 లక్షలు కాజేసిన మహిళ

పటాన్‌చెరుటౌన్: ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళను నమ్మి ఓ ఉద్యోగి రూ.లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్ పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫేస్‌బుక్‌లో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. మహిళ తాను లండన్ నుంచి హైదరాబాద్‌కి ఓ ప్రాజెక్ట్ పని పై వస్తున్నానని అతడిని నమ్మించింది. కొంత నగదు అవసరం ఉందని, హైదరాబాద్‌కు వచ్చాక తిరిగి నగదు ఇచ్చేస్తానని చెప్పింది. ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా రూ.8 లక్షల 57 వేల నగదును మహిళకు పంపించాడు. హైదరాబాద్‌కు వస్తానని చెప్పిన ఆమె రాకపోవగా, మెసేజ్‌లకు స్పందించలేదు. ఉద్యోగి తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి చెత్త వేస్తుండగా..

కింద పడి మెకానిక్ మృతి

దుబ్బాక : భవనం పైనుంచి పడి బైక్ మెకానిక్ మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణంలోని చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 3వ వార్డుకు చెందిన పోతరాజు లింగం (37) గ్రామంలో బైక్ మెకానిక్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. 3 నెలల కిందట లింగం దుబ్బాక ఆర్టీసీ బస్ డిపోలో టైర్ మెకానిక్‌గా పనిలో చేరాడు. 15 రోజుల నుంచి దుబ్బాకలోని గుండ్ల హరికృష్ణ ఇంట్లో మొదటి అంతస్తులో కిరాయికి ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి లింగం ఇంట్లోని చెత్తను తాను ఉంటున్న అంతస్తు నుంచి కిందికి పడేసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన భార్య ఇంటి యజమాని సాయంతో దుబ్బాకలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య వేద శ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



లింగం (ఫైల్)

రైతు దారుణ హత్య



రాజ భూమయ్య(ఫైల్)

- పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి..
- మంచంపైనే శవమై కనిపించిన భూమయ్య
- ముఖం, మెడపై తీవ్ర గాయాలు
- మెదక్ జిల్లా కౌడిపల్లిలో ఘటన
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ, ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): పండుగ పూట రైతు ఇంట్లో విషాదం నెలకొంది. రోజు మాదిరిగా పొలం వద్దకు కాపలా వెళ్లిన రైతు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన కౌడిపల్లికి చెందిన రాజం భూమయ్య(65)కు గ్రామ సమీపంలో (కూకుట్లపల్లి గ్రామానికి వెళ్లే దారిలో) వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుతం వరి పంట సాగు చేస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో భోజనం చేసి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన పిస్కె రంగేశ్ గొడ్డలి అవసరం ఉండి భూమయ్య ఇంటికొచ్చాడు. అతడి భార్య దుర్గమ్మ పొలం వద్ద నుంచి భర్త భూమయ్య ఇంకా ఇంటికి రాలేదని. అక్కడికి వెళ్లి తెచ్చుకో అని చెప్పింది. రంగేశ్ పొలం వద్దకు వెళ్లగా భూమయ్య మంచంపై హత్యకు గురై ఉన్నాడు. ఒక్కసారిగా భయానికి గురైన రంగేశ్ మృతుడి కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు, పోలీసులు సమాచారం ఇచ్చాడు.

పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ

భూమయ్య హత్య విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వెళ్లి పరిశీలించారు. సీఐ జాన్‌రెడ్డి, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ అధికారులు మృతదేహం, ఘటనా స్థలం వద్ద పూర్తి స్థాయిలో ఆధారాలు సేకరించి డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు.

ముఖంపై తీవ్ర గాయాలు..

మృతుడు భూమయ్య ముఖం దవడపై, నోరు, ముక్కు, నొసలుపై తీవ్ర గాయాలు ఉన్నాయి. గొడ్డలి లేదా ఇతర పదునైన ఆయుధంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం మంచంపై ఉండగా మంచం పైన, కింద ఎలాంటి రక్తం మరకలు లేవు. ఘటనా స్థలంలో హత్య జరిగి ఉంటే రక్తం కారి మరకలు అయ్యేవని, పెనుగులాడిన ఆనవాళ్లు ఉండేవని అలాంటివి లేకపోవడంతో వేరే చోట హత్యచేసి యథావిధిగా మంచంపై పడుకోబెట్టారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుటుంబ కలహాలా.. లేక ఇతర కారణాలు ఉన్నాయా.. అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

గ్రామంలో విషాదఛాయలు..

రాజం భూమయ్య హత్య విషయం తెలియడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య దుర్గమ్మ, కుమారుడు శంకర్, కూతురు పోచమ్మ ఉన్నారు. పిల్లలు ఇద్దరికీ పెండ్లిళ్లు అయ్యాయి. కుమారుడు శంకర్ ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు కొనివ్వలేదని..

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య



నవీన్ కుమార్(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన బుట్టి నర్సింహులుకి ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు బుట్టి నవీన్ కుమార్ (26) రోజువారి కారు డ్రైవర్ పని చేస్తుంటాడు. సొంత కారు కొనుక్కోవాలన్న కోరికతో తండ్రిని అడిగాడు. కొద్ది రోజులు రోజువారిగానే పనిచేసి వచ్చిన డబ్బులకు మరికొన్ని కలిపి కొందామని తండ్రి చెప్పాడు. తండ్రి మాట వినని నవీన్ అలిగి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ విషయమై తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లో నుంచి బయటకొచ్చి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకి ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొర్రెలను కడిగేందుకు వెళ్లి..

నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో పడి కాపరి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపేట శివారులో చోటు చేసుకుంది. ఎస్.ఐ.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్‌కు చెందిన సావర్పల్లి రాజు(38) గొర్రెల కాపరి. గొర్రెలను మేపేందుకు నాలుగు రోజుల కిందట గ్రామస్తులతో కలిసి కొత్తపేట శివారులోకి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం గొర్రెలను అవతలి ఒడ్డుకు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. కాపరులు వెతికినా ఫలితం ఆచూకీ లభించలేదు. ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సోమవారం మృతదేహం నీటిలో నుంచి బయటకు తేలింది. మృతుడి భార్య తుక్కమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మల్లేశ్ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. గుమ్మడిదల గ్రామానికి చెందిన పాదాల మల్లేశ్(60) కుటుంబ సభ్యులతో కలిసి బొంతపల్లిలోని మల్లన్న జాతరకు వచ్చాడు. తిరిగి ఇంటికొస్తున్న సమయంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనం అదుపుతప్పి మల్లేశ్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ మల్లేశ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి యువకుడు మృతి

జిన్నారం(పటాన్‌చెరు): చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన వడ్ల కార్తీక్(14) స్నేహితులతో కలిసి ఈనెల 24న స్థానికంగా నల్ల చెరువులోకి ఈతకు వెళ్లాడు. కార్తీక్ ఈత రాకపోవడంతో చెరువు లోపలికి వెళ్లి గల్లంతయ్యాడు. విషయాన్ని స్నేహితులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈతగాళ్లతో వెతికించగా కార్తీక్ మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు



కార్తీక్ మృతదేహం